సాక్షి తిరుపతి
బుధవారం । 31 । మే । 2023



ఓవరాల్ చాంపియన్ ఆంధ్రా జట్టు
జాతీయ రోలర్ స్కీ, స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. - 8లో



ఆహ్వానం
ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణ దాత గౌతమ్ సింఘానియాకు టీటీడీ చైర్మన్, ఈఓ ఆహ్వాన పత్రికను అందజేశారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	38	27
చిత్తూరు	38	26
తిరుమల	34	23
గూడూరు	40	29
నగరి	39	27

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 78,126 మంది స్వామివారిని దర్శించుకోగా.. 37,597 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.74 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 143 మంది హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం 12,001 నుంచి 27వేల ర్యాంకు వరకు పాలిసెట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌కు 143 మంది విద్యార్థులు హాజరై తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్, కో-ఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం 27,001 నుంచి 43 వేల ర్యాంకు వరకు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలన చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు సైన్స్ సెంటర్‌లో ఎగ్జిబిషన్

తిరుపతి కల్చరల్: రీజనల్ సైన్స్ సెంటర్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు జీన్-హెల్త్ కనెక్షన్ అనే అంశంపై కొత్త మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నట్లు సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. ఎస్వీయూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాజారెడ్డి చేతుల మీదుగా ఆరంభమయ్యే ఈ ఎగ్జిబిషన్ రెండు రోజుల పాటు ఉంటుందని, తర్వాత తిరుపతిలోని వివిధ కళాశాలలకు ప్రయాణిస్తుందని పేర్కొన్నారు.

త్రిసూర్ ఆయుర్వేద సంస్థల సందర్శన



త్రిసూర్‌లోని వైద్య రత్న ఆయుర్వేద సంస్థలను పరిశీలిస్తున్న టీటీడీ అధికారులు

తిరుపతి కల్చరల్: కేరళ రాష్ట్రం త్రిసూర్‌లోని వైద్యరత్న ఆయుర్వేద వైద్య సంస్థలను టీటీడీ జేఈవో సదాభార్గవి, సీఏవో శేషశైలేంద్ర, ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేణుదీక్షిత్ మంగళవారం సందర్శించారు. ఆయుర్వేద వైద్యాన్ని కార్పొరేట్ తరహాలో నిర్వహిస్తున్న విధానం, ప్రజలు ఈ వైద్యానికి ఆకర్షితులవుతున్న అంశాలను వారు అడిగి తెలుసుకున్నారు. సంస్థ నిర్వహిస్తున్న పరిశోధన కేంద్రం, ఆస్పత్రి ఫార్మసీని అధికారులు పరిశీలించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రోగులు ఆన్‌లైన్, నేరుగా వచ్చి ఓపీ, ఇన్ పేషెంట్ సేవలు పొందుతున్న విధానంపై ఆరాతీవారు. అనంతరం టీటీడీ అధికారులు వైద్య రత్నం సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ నీలకంఠన్‌ను కలిసి ఆస్పత్రి నిర్వహణ, వైద్య సేవలు, పరిశోధనలు, మార్కెటింగ్ విధానాలపై చర్చించారు. టీటీడీతో కలిసి పని చేయాలని అధికారులు ఆహ్వానించడం పట్ల ఆ సంస్థల ఎండీ సంతోషం వ్యక్తం చేశారు.

గాలీవాన



ఐఐటీ సమీపంలో నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ వాసుదేవయ్య

ఏర్పేడు: జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం గాలీవాన బీభత్సం సృష్టించింది. బలమైన గాలులు వీయడంతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఏర్పేడు మండలంలోని దుర్గిపేరి, నాగంపల్లి, నచ్చనేరి, కృష్ణంపల్లి, జంగాలపల్లి వ్యవసాయ పొలాలు, మేర్లపాక రెవెన్యూలోని ఐఐటీ సమీపంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, 10 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సమాచారం అందిన వెంటనే ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నేలకొరిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

సర్వర్ డౌన్

తిరుపతి అర్బన్: తిరుపతి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సర్వర్ సమస్యలతో ఆస్తి కొనుగోలుదారులు, అమ్మకం దారులు ఇబ్బందులు పడుతున్నారు. సోమ, మంగళవారాలు రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ పూర్తయినప్పటికీ డాక్యుమెంట్స్ ప్రింటింగ్‌కు సంబంధించి సర్వర్ ఇబ్బందులు తలెత్తడంతో మరోరోజు రావాల్సి వస్తోంది.

4 వసంతాల పండగ



వైఎస్ జగన్ అనే నేను.. నాలుగేళ్లుగా ప్రజల గుండెల్లో ప్రతిధ్వనిస్తోంది. పేదల పక్షపాత ప్రభుత్వంలో అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధి పరుగులు తీస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా మారింది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ సర్కారు అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. ఊరూరా భారీ కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. అదే స్ఫూర్తితో ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతామని నినదించారు. రాబోయే సార్వత్రిక సమరంలో గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తామని ప్రతినబూనారు.

- జిల్లా వ్యాప్తంగా మిన్నంటిన సంబరాలు
- కేక్‌లు కట్‌చేసి పండగ చేసుకున్న నేతలు
- చంద్రబాబు మేనిఫెస్టోపై విమర్శల బాణాలు
- బూటకపు హామీలు ప్రజలు నమ్మరని హితవు



సదుంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, తిరుపతి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనను కొనియాడారు. పుంగనూరు నియోజకవర్గం సదుంలో రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర గృహనిర్మాణశాఖా మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం, ఎమ్మెల్సీ భరత్, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష తదితరలు పాల్గొన్నారు. తిరుపతిలోని ఇందిరామైదానంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కేట్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. చిత్తూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. సత్యవేడు నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నారాయణవనంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్వేటినగరంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి ఆధ్వర్యంలో కేట్ కట్‌చేశారు. గూడూరులో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు ఆధ్వర్యంలో శాంతినగర్ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



సంబరాల్లో భాగంగా తిరుపతిలో బెలూన్లు వదులుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మేయర్, అధికారులు

వెన్నుపోటు..చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

నారాయణవనం: నమ్మిన.. నమ్ముకున్న వారిని వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజం. రామారావు గాలితో గెలిచిన వాందరూ ఆయనకే ద్రోహం చేసి, డబ్బులకు అమ్ముడుపోయి చంద్రబాబు వెనుక ఉన్నారని, వీరందరూ నేడు మాట్లాడడం విడ్డూరంగా ఉందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. నారాయణవనం వైఎస్సార్ సర్కిల్ వద్ద సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పార్టీ శ్రేణులతో కలిసి డిప్యూటీ సీఎం నారాయణస్వామికి స్వాగతం పలికారు. జగనన్న పాలన నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం కేక్ కట్‌చేసి డెప్యూటీ సీఎం కి తినిపించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గతంలో ఇంటికొక ఉద్యోగం, పేదలకు సాగుపొలం, నిరుద్యోగ భృతి అంటూ వివిధ హామీలిచ్చి ప్రలోభపెట్టారని, నేడు అదే హామీలతో మళ్లీ బురిడీ కొట్టించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. పేదలకు ఇంటి స్థలాలు ఇస్తే కోర్టుల నుంచి స్టేలు తెచ్చి అడ్డుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఒక న్యాయం, పెత్తందారులకు, ఆయన వర్గానికి ఒక న్యాయమా..?అని ప్రశ్నించారు. పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు అన్నాదొరై, కోనేటి బాబు పాల్గొన్నారు.

నవశకానికి నాంది



కేక్ కట్ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సదుం: నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవశకానికి నాంది పలికారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేడుకలో ఆయన పాల్గొని.. కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. నవరత్నాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. టీడీపీ మోసపూరిత హామీలను ప్రజలు విశ్వసించరని స్పష్టం చేశారు. అంతకు ముందు నేతాజీ, వైఎస్సార్ విగ్రహాలకు మంత్రి నివాళులర్పించారు. వైఎస్సార్, సీఎం వైఎస్ వైజ్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి పాల్గొన్నారు.



గూడూరులో పార్టీ నాయకులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే వెలగపల్లి



నారాయణవనంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



శ్రీకాళహస్తిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

మోసపూరిత హామీలు నమ్మరు బాబు!

తిరుపతి మంగళం : అధికార దాహంతో నోరు తెరిస్తే అబద్ధాలు చెప్పడం.. మోసం చేయడమే చంద్రబాబు నైజమని, వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న దురుద్దేశంతో మోసపూరిత హామీలు, మేనిఫెస్టోలు తెచ్చినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ధ్వజమెత్తారు. 2019లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన చారిత్రక విజయానికి నాలుగేళ్లు పూర్తైన సందర్భంగా మంగళవారం తుడా సర్కిల్లోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష భారీ కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014లో వందలాది మోసపూరిత వాగ్దానాలు చేసి వంద పేజీల మేనిఫెస్టోను విడుదల చేసి చంద్రబాబు అధికారంలోకి రాగానే గాలికొదిలేశారని, అందుకే చంద్రబాబును రాష్ట్ర ప్రజలు 2019 ఎన్నికల్లో వెనక్కి నెట్టారని తెలిపారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుగా జగనన్న నవరత్నాలను చూసి మరో మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను బురిడీ కొట్టించాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏమి నెరవేర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ, నిరుద్యోగ భృతి.. ఇలా చెప్పిన వాటిలో ఏ ఒక్కటైనా నెరవేర్చావా చంద్రబాబు అని ప్రశ్నించారు. పేదప్రజల సంక్షేమమే లక్ష్యంగా దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడూ అందించలేనన్ని సంక్షేమ పథకాలు అందించిన గొప్ప నాయకుడు సీఎం జగనన్న అని కొనియాడారు. అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో పేదల సంక్షేమం కోసం రూ.3.4 లక్షల కోట్లను కేటాయించారని చెప్పారు. పేదప్రజలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు, గంగమ్మ ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



చారిత్రక విజయానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్

గరుడ వాహనంపై గోవిందుడి చిద్విలాసం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం రాత్రి గరుడ వాహనాన్ని అధిరోహించి స్వామివారు కనువిందు చేశారు. భక్తజన బృందాలు, కళా ప్రదర్శనలు, మంగళ వాయిద్యాల నడుమ, భక్త జనుల గోవిందనామ స్మరణల మధ్య స్వామివారి వాహన సేవ వైభవంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులకు కర్పూర నీరాజానలు సమర్పించారు. దీనికిముందు ఉదయం శ్రీగోవిందరాజస్వామి మోహినీ అలంకరణతో పల్లకీలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, కంకణభట్టార్ ఏపీ.శ్రీనివాస దీక్షితులు, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు పాల్గొన్నారు.



గరుడ వాహనంపై ఊరేగుతున్న గోవిందరాజస్వామి వారు

శ్రీకాళహస్తి టీడీపీలో గ్రూపు రాజకీయాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి టీడీపీలో గ్రూపు రాజకీయాలు బయటపడ్డాయి. పార్టీ కార్యక్రమాలు గ్రూపులుగా విడిపోయి వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. మహిళలు, బీసీలు అంటూ కార్యక్రమాలు చేసుకుంటున్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారు, కార్యకర్తలు ఏ కార్యక్రమానికి వెళ్లాలో తెలియక తికమక పడుతున్నారు. ఎన్నికలు వచ్చే సమయానికి మరికొంతమంది నాయకులు తెలుగుదేశంలోకి వచ్చి మరిన్ని గ్రూపులు పెరిగే అవకాశం ఉందని చిర్చించుకుంటున్నారు. అప్పుడు తాము ఏ గ్రూపులో ఉండాలో తెలియక ఇబ్బందులు పడాల్సి వస్తుందేమోనని కార్యకర్తలు వాపోతున్నారు. ఇలాంటిదే మంగళవారం పట్టణంలో బయటపడింది. టీడీపీ నేతలు రెండు గ్రూపులుగా విడిపోయి టీడీపీ మేనిఫెస్టోకి క్షీరాభిషేకం చేయడంతో కార్యకర్తలు గందరగోళానికి, అసహనానికి లోనయ్యారు.

నేడు బోధనేతర సిబ్బందికి కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందికి బుధవారం బదిలీలపై కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. చిత్తూరు డీఈఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభిస్తారని, ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీ ఉంటుందని చెప్పారు.

లాజిస్టిక్స్ మౌలిక వసతులకు పెద్దపీట



మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమరనాథ్

వరదయ్యపాళెం: రాష్ట్రంలో అద్భుతమైన లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమరనాథ్ తెలిపారు. మంగళవారం శ్రీసిటీలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సమావేశంలో తిరుపతి ప్రాంతానికి చెందిన సీఐఐ సభ్యులు, శ్రీసిటీలోని పలు పరిశ్రమల సీఈఓలు, పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. పరస్పర చర్చల ద్వారా పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య అవగాహన పెంపొందించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని సీఐఐ తిరుపతి రీజియన్ చైర్మన్ ప్రియమంజరి టోడి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. భారీ పారిశ్రామిక పార్కు అభివృద్ధితో పాటు వెనుకబడిన ప్రాంతంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాల కల్పనకు శ్రీసిటీ యాజమాన్యం తీసుకున్న చొరవను అభినందించారు. శ్రీసిటీ పారిశ్రామిక హబ్ పురోగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి దీనికి కృషి చేసిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిని ప్రశంసించారు. అనంతరం శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న రోజు పరిశ్రమల శాఖా మంత్రి మొట్టమొదటిగా శ్రీసిటీ పర్యటనకు రావడం తాము గౌరవప్రదంగా భావిస్తున్నామన్నారు. పరిశ్రమలు అనేక ప్రయోజనాలను పొందేందుకు సీఐఐలో సభ్యత్వం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పరిశ్రమల ప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి తగు పరిష్కారాలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు పరిశ్రమలను సందర్శించి అక్కడ ఉత్పత్తులను పరిశీలించారు. శ్రీసిటీ పర్యటనకు వచ్చిన మంత్రిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి, స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిళివేటి సంజీవయ్యలు కలిశారు.

మంత్రి చేతుల మీదుగా పరిశోధనా గ్రంథం ఆవిష్కరణ

శ్రీసిటీ పరిసర గ్రామీణ ప్రాంతాలు, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు, వారి జీవన విధానంలో తీసుకొచ్చిన మార్పులను తెలుసుకునే నిమిత్తం తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వారు రూపొందించిన పరిశోధనా గ్రంథాన్ని మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. గ్రంథాన్ని రూపొందించిన ఆచార్య నీలిమ, డాక్టర్ నిరజా, డాక్టర్ శ్రీరజనిను మంత్రి ప్రశంసించారు.

క్లుప్తంగా

నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపిస్తున్న ఎస్‌ఈబీ సీఐ

తిరుపతి క్రైమ్: గంజాయి కేసులో ఈ నెల ఒకటో తేదీన పట్టుబడిన నిందితుల్లో పరారీలో ఉన్న మరో నలుగురిని మంగళవారం జీవకోనలో అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తిరుపతి సీఐ నాగరాజు తెలిపారు. వివరాలు.. ఈ నెల 1వ తేదీన ఈ కేసుకు సంబంధించి నలుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. సమాచారం మేరకు.. తప్పించుకున్న మరో నలుగురు.. జీవకోనకు చెందిన నానికుమార్ అలియాస్ నాని, సాయికుమార్ అలియాస్ సాయి, తేజ, ఎం సాయికుమార్‌ను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. వీరి నుంచి కేజీ 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

లారీని ఢీకొన్న కారు

రాపూరు: ఏర్పేడు–పెంచలకోన జాతీయ రహదా రి, రాపూరు మండలం, సిద్దవరం గ్రామ సమీపంలో మంగళవారం లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం.. ఆత్మకూరు మండలం, ఆరేడు జంగాలపల్లి గ్రామానికి చెందిన భానుప్రకాష్, రాజేశ్వరి తమ కుమార్తె విష్ణుశ్రీకి వెంట్రుకలు ఇచ్చేందుకు కారులో తిరుమలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. అదే సమయంలో సిద్దవరం గ్రామ సమీపంలో రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. కారులోని రాజేశ్వరికి కుడికాలు, హజరతమ్మ ఎడమ భుజం విరిగింది. అలాగే నాగార్జున అనే వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

భారంగా కాదు.. బాధ్యతగా పనిచేద్దాం



మాట్లాడుతున్న డెప్యూటీ సీఎం నారాయణస్వామి

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గృహనిర్మాణాలపై మంత్రి సమీక్ష

తిరుపతి అర్బన్: ఇంటి నిర్మాణాలు చేపట్టడంలో భారంగా కాకుండా బాధ్యతగా పనిచేద్దామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, డెప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, గృహనిర్మాణశాఖ రాష్ట్ర మంత్రి జోగిరమేష్ అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. గూడు లేని పేదలందరికీ పక్కా గృహాలు అందించడం బృహత్తర కార్యక్రమంగా అభివర్ణించారు. అయితే ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడుతో పాటు ఆ పార్టీ నేతలు గృహనిర్మాణాలపై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. ఇంటి నిర్మాణాలు చేపట్టడంలో అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు పూర్తయితే కొత్త గ్రామాలు, కొత్త పట్టణాలు నిర్మించినట్టవుతుందని వెల్లడించారు. విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతృత్వంలో జగనన్న కాలనీల్లో శరవేగంతో విద్యుత్ సౌకర్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల దిగ్విజయంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. జూలై నాటికి 5 లక్షల ఇళ్లు సామూహిక గృహ ప్రవేశాలు చేపడుతామని చెప్పారు. శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, సత్యవేడు, చిత్తూరు ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, కోనేటి ఆదిమూలం, జంగాలపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ పేదోడి సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేరవేర్చుతున్నారని, దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ ఫలాలు అందించలేదన్నారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ అభివృద్ధికి అడ్రస్ ఆంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, వెంకటగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రామరాజ్యం సాగుతోందన్నారు. తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, చిత్తూరు మేయర్ అముద, గృహ నిర్మాణ శాఖస్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, ఎండీ లక్ష్మిషా, కలెక్టర్లు కే.వెంకటరమణారెడ్డి, షన్మోహన్, తిరుపతి డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, తిరుపతి కమిషనర్ హరిత, ఆర్డీవోలు, గృహనిర్మాణశాఖ అధికారులు పాల్గొన్నారు.


హోటల్ మేనేజ్ మెంట్ సంస్థ సీజ్



సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు

తిరుపతి తుడా: శ్రీనివాస సేతు పిల్లర్లపై నిబంధనలకు విరుద్ధంగా అతికించిన వాల్ పోస్టర్లపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కొరడా ఝులిపించారు. వాల్ పోస్టర్లు అతికించిన సంస్థకు భారీ జరిమానా విధించారు. ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. లీలామహల్ సర్కిల్ నుంచి మంగళం వైపు ఉన్న శ్రీనివాససేతు ఫ్లై ఓవర్ స్తంభాలపై అనుమతులు లేకుండా చెన్నైస్ అమ్రిత ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్ మెంట్ సంస్థ వాల్ పోస్టర్లను అతికించింది. ఫిర్యాదులు అందడంతో ఆయన సిబ్బందితో కలిసి సదరు హోటల్‌ను సీజ్ చేశారు. పిల్లర్లపై అతికించిన వాల్ పోస్టర్‌లను తొలగించారు. సంస్థ కార్యాలయాన్ని సీజ్ చేయడంతో పాటు రూ.50 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఆలయం ఎదుట మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్



మంత్రి జోగి రమేష్

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్, రాష్ట్ర మంత్రి జోగిరమేష్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఆహ్వానం



దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న టీటీడీ చైర్మన్, ఈఓ

తిరుమల: ముంబైలో జూన్ 7న జరిగే శ్రీవారి ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిన దాత గౌతమ్ సింఘానియాకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ముంబైలో వారు సింఘానియాను కలిసి శాలువాతో సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కూడా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి చైర్మన్, ఈవో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండేని కలిసి ఆహ్వాన పత్రిక అందజేసిన విషయం తెలిసిందే.

ఆక్రమణదారులను గుర్తించండి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని పసల పెంచలయ్య నగర్ (వట్రపాళెం)లో ఇంటి స్థలాలలో ఎక్కువగా ఆక్రమణదారులున్నారని, వారిని గుర్తించి వెంటనే ఖాళీ చేయించి నిజమైన లబ్ధిదారులకు ఇప్పించే ఏర్పాటు చేద్దామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. పసల పెంచలయ్యనగర్ పక్కనే రెండున్నర ఎకరాల స్థలంలో చెంగాళమ్మ ఆలయం సమీపంలోని కాళంగినది కరకట్టమీద వున్న లెప్రసీ కాలనీ వారికి 33 మందికి ఇళ్లు నిర్మించి మంగళవారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఆర్డీఓ ఆర్ చంద్రముని చేతుల మీదుగా గృహప్రవేశాల కార్యక్రమాన్ని చేశారు. చెంగాళమ్మ ఆలయ సమీపంలో కరకట్టమీద 33 కుటుంబాలను అక్కడ ఖాళీ చేయించి వట్రపాళెం సమీపంలో రెండున్నర ఎకరాల్లో 33 ఇళ్లు యుద్ధప్రాతిపదికన నిర్మించి వారికి అప్పగించారు. దీనికి ప్రభుత్వం తరపు నుంచి ఒక్కొక్క ఇంటికి రూ.1.80 లక్షలు మంజూరు కాగా ఆలయచైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి దాతృత్వంతో ఒక్కొక్క ఇంటికి రూ.1.50 లక్ష తన సొంతనిధులు ఇచ్చి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించారు. రూ. 50లక్షలు తన సొంత నిధులు ఇచ్చి ఇళ్లు నిర్మించడంతో ఈ కాలనీకి ఆయన తండ్రి దువ్వూరు నల్లారెడ్డి నగర్ అనినామకరణం కూడా చేశారు. లబ్ధిదారులతోనే 33 ఇళ్లకు గృహప్రవేశాలు చేయించి వారికి ఇంటిపట్టా, ఇల్లు అప్పగించారు. ఎమ్మెల్యే ఈ వట్రపాళెం కాలనీలో చాలామంది అనర్హులు ఇంటిస్థలాలను ఆక్రమించారని సర్వే నిర్వహించి అనర్హులను ఏరిపారేయాలని ఆర్డీఓ చంద్రమునిని ఆదేశించారు. దువ్వూరు బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ తన తండ్రి దువ్వూరు నల్లారెడ్డి అప్పట్లో స్వాతంత్ర్యపోరాటం చేశారని, ఓసారి గాంధీ సూళ్లూరుపేటకు వచ్చిన సందర్భంగా ఆయన్ని పేరుపెట్టి పిలిచారని నానుడి వుందని అందుకే ఆయన పేరు పెట్టాలనే ఉద్దేశంతో దువ్వూరు నల్లారెడ్డి నగర్‌గా నామకరణం చేశామని తహశీల్దార్ కే రవికుమార్, కమిషనర్ నరేంద్రకుమార్, ఈ ఓ ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, పార్టీ నేతలు దువ్వూరు గోపాల్‌రెడ్డి జెట్టి వేణుయాదవ్, పాలకమండలి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలసత్యనారాయణ, పద్మజ, కౌన్సిలర్ తుపాకులు సుశీల, మనుస్వామి పాల్గొన్నారు.

యువకుడి మృతి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని కల్లిపూడి గ్రామానికి చెందిన చిన్నారెడ్డి కుమారుడు కాటారెడ్డి(40) మంగళవారం తెలుగుగంగ కాలవ సమీపంలో అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఎస్‌ఐ రాఘవేంద్ర కథనం.. కల్లిపూడి గ్రామానికి చెందిన చిన్నారెడ్డి కుమారుడు కాటారెడ్డి, నల్లపురెడ్డి కుమారుడు కాటారెడ్డి ఇద్దరూ సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్లి సాయంత్రం వరకు మద్యం సేవించారు. రాత్రి చిన్నారెడ్డి కుమారుడు కాటారెడ్డి రౌతుసూరమాల సమీపంలో తెలుగుగంగ కాలువ గట్టుపై మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

తిరుమల ఘాట్‌లో ప్రమాదం

తిరుమల : అలిపిరి నుంచి తిరుమలకు వస్తున్న కారు రెండో ఘాట్ రోడ్డులో అదుపుతప్పి రక్షణగోడను ఢీకొంది. బాధితులు కథనం.. తెలంగాణ రాష్ట్రం, వనపర్తి, కిలాఘనూరుకు చెందిన ఏ.రమణయ్య, ప్రమీల దంపతులు వారి కుమారులు అభి, హరికృష్ణ మరో ఇద్దరు చిన్నారులతో కలిసి తిరుమలకు కారులో బయలుదేరారు. అలిపిరిలో తనిఖీ అనంతరం ఘాట్ రోడ్డు మీదుగా కారును అభి డ్రైవింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండో ఘాట్ రోడ్డులోని రెండో మలుపువద్ద అకస్మాత్తుగా రక్షణ గోడను ఢీకొన్నారు. కారులోని ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో కారులోని వారు బయటపడ్డారు.

ఇసుక రీచ్ అనుమతులు రద్దు చేయండి



కాలువగట్టు వద్ద ఆందోళన చేస్తున్న వివిధ పార్టీల నాయకులు, రైతులు

- రహదారిపై బైఠాయించిన రైతులు

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని కాలువగట్టు సమీపంలో స్వర్ణముఖి నదిలో ఇచ్చిన ఇసుక రీచ్ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ అన్ని పార్టీల నాయకులు రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. మండల పరిధిలోని కాలువగట్టు గ్రామ రహదారిపై మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కాలువగట్టు గ్రామం వద్ద స్వర్ణముఖి నదిలో 25 పంచాయతీలకు సంబంధించి ఉన్న తాగునీటి పథకాలు, వ్యవసాయ బోర్లు తదితరాలను పరిశీలించకుండానే ఇసుక రీచ్ ఏర్పాటుకు జిల్లా అధికారులు అనుమతివ్వడంపై మండిపడ్డారు. వెంటనే అనుమతులు రద్దుచేయకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో సీఐ నరసింహారావు, తహసీల్దార్ రాజేంద్ర కాలువగట్టు గ్రామం వద్దకు చేరుకుని, ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ఇక్కడి పరిస్థితులను కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. కార్యక్రమంలో మడపలం, అన్నమేడు, వేముగుంటపాళెం, కూచివాడ, కూచివాడ పాళెం, కాపులూరు పంచాయతీలతో పాటు సుమారు పది పంచాయతీలకు చెందిన గ్రామప్రజలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు దేవారెడ్డి విజయులురెడ్డి, అశోక్‌రెడ్డి, వాకాటి సుదాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మధరెడ్డి, బాబురెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం



సేనాపతి ఉత్సవంలో విశ్వక్సేనుడు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. సేనాపతి ఉత్సవంలో విశ్వక్సేనుడు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి మాడ వీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారికి నిత్యపూజాదికార్యక్రమాలను పూర్తి చేశారు. సాయంత్రం గంట, నైవేద్యం తదితర కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక భావనారుషి ఆలయం నుంచి పద్మసాలీలు కొడి పార్వ వస్త్రాన్ని మేళ తాళాలతో ఆలయ అర్చకులకు సమర్పించారు. సేనాపతి ఉత్సవంలో భాగంగా మృత్యంగ్రహణం, పుట్టమట్టిని పాలికల్లో నింపి నవధాన్యాలను మొలకెత్తించే కార్యక్రమాలను అర్చకులు పూర్తిచేశారు. ఆలయ అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసరాఘభట్టాచార్య, నరసింహభట్టాచార్య మాట్లాడుతూ బుధవారం వేకువ జామున 3.30 గంటలకు సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలను పూర్తిచేసి, 6.30–7.30 గంటల మధ్య మిధున లగ్నంలో గరుడాళ్వార్ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింపజేయనున్నట్టు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు ఉత్సవర్లకు తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకే స్వామివారు పెద్దశేష వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో ఊరేగింపుకు బయలు దేరుతారని పేర్కొన్నారు.

ఓవరాల్ చాంపియన్ ఆంధ్రా జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలో గత రెండు రోజులుగా నిర్వహించిన రెండో జాతీయ రోలర్ స్కీ, స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీలకు 13 రాష్ట్రాల నుంచి 150కి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అల్ రౌండ్ ప్రతిభతో మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్ జట్టు నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకుంది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో కర్ణాటక, హార్యానా రాష్ట్ర జట్లు నిలిచాయి. విజేతలకు ట్రోఫీలు, పతకాలను ఏపీఎస్పీడీసీల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, స్కై అండ్ స్నోబోర్డ్ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అర్షద్, కోశాధికారి రేణుక, ఉపాధ్యక్షుడు రజాక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోలర్ స్కై అసోసియేషన్ చైర్మన్ ఎస్.విశ్వ చందన్‌రెడ్డి, కార్యదర్శి రసూల్ ఖాన్, కార్యనిర్వాహక కార్యదర్శి సురేంద్రారెడ్డి, తిరుపతి ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, అంతర్జాతీయ మాజీ అథ్లెట్ ఆంజనేయులు నాయుడు పాల్గొన్నారు.

పరుగుల ప్రవాహం

- చంద్రగిరి ఐపీఎల్‌లో రెచ్చిపోతున్న గ్రామీణ క్రీడాకారులు
- అవార్డులను ప్రదానం చేసిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



క్రీడాకారులకు అవార్డులను ప్రదానం చేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, రఘునాథరెడ్డి





ప్రతిభ చాటుతున్న క్రీడాకారులు

తిరుపతి రూరల్: చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో గ్రామీణ క్రీడాకారులు పరుగుల ప్రవాహం పారిస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ వేడిలో పిచ్ స్వభావాన్ని ఉపయోగించుకుంటూ బ్యాట్స్‌మెన్లు రెచ్చిపోతున్నారు. సాయంత్రం చల్లబడిన వాతావరణంలో బౌలర్లు విజృంభిస్తున్నారు. వెయ్యి టీమ్‌లతో చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చంద్రగిరి ఐపీఎల్ టోర్నమెంట్‌లో పల్లెల నుంచి వచ్చిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ చాటుతున్నారు. మంగళంకు చెందిన ధనుష్ 25 బంతుల్లో 84 పరుగులు సాధించాడు. అలాగే తిరుచానూరుకు చెందిన కిరణ్ రెండు ఓవర్లలో 5 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు సాధించి ఉత్తమ బౌలర్ అవార్డు కైవసం చేసుకున్నాడు.

మ్యాచ్‌లకు వరుణుడు తోడ్పాటు!

తుమ్మలగుంటలో నిర్వహిస్తున్న చంద్రగిరి ఐపీఎల్‌కు వానదేవుడు సైతం సహకరిస్తున్నాడు!. ఉదయం నుంచి మైదానాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడుతోంది. తుమ్మలగుంటతో పాటు పేరూరు, మల్లంగుంటలోనూ చినుకులు పడుతున్నాయి. అయితే మ్యాచ్‌లు జరుగుతున్న 12 మైదానాల్లో ఎక్కడా వర్షం లేదు. మ్యాచ్‌లు అన్నీ పూర్తయిన అర్ధగంట తర్వాత అంటే సాయంత్ర 6 గంటలకు మైదానాల్లో వర్షం పడింది. దీంతో క్రీడాకారులతో పాటు నిర్వాహకులు సైతం వరుణ దేవుడికి కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డులు ప్రదానం

ఇప్పటికే మొదట విడత లీగ్ మ్యాచ్‌లు పూర్తయిన చంద్రగిరి ఐపీఎల్ టోర్నమెంట్‌లో రెండో విడత మ్యాచ్‌లు హోరా హోరీగా సాగుతున్నాయి. మంగళవారం 12 క్రీడా మైదానాల్లో 48 మ్యాచ్‌లు జరిగాయి. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ గుర్తింపు పొందిన బాల,బాలికల క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మంగళవారం పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మ్యాచ్‌ల్లో ఉత్తమ ప్రతిభ చాటిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఆల్‌రౌండర్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోదరుడు రఘునాథరెడ్డి పాల్గొన్నారు.